వీర విక్రమ.. ధీర విక్రమ

- చంద్రుడిపై కాలుమోపిన విక్రమ్ ల్యాండర్
- జాబిల్లి వరకూ పాకిన దేశఖ్యాతి
- మిన్నంటిన సంబరాలు

కంబాలచెరువు: ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్ 3 విజయవంతం కావడంపై సంబరాలు మిన్నింటాయి. జాబిల్లిపై బుధవారం సాయంత్రం 6.02 గంటలకు విక్రమ్ ల్యాండర్ కాలుమోపింది. ఈ శుభ ఘడియ కోసం యావత్ దేశంతో పాటు ప్రపంచం కూడా ఆసక్తిగా చూసింది. మన దేశ ఖ్యాతి చందమామ వరకూ చేరింది. ఈ అద్భుత ఘట్టాన్ని వీక్షించేందుకు ప్రెస్‌క్లబ్ ఆధర్యంలో ఆనం కళాకేంద్రంలో ఎల్‌సీడీపై ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జి కలెక్టర్ తేజ్ భరత్, కమిషనర్ దినేష్‌కుమార్ హాజరయ్యారు. అలాగే విద్యార్థులు, ఉపాధ్యాయులు తరలివచ్చారు. ప్రయోగం విజయవంతం కావడంతో అందరూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. జేసీ భరత్ తేజ్ మాట్లాడుతూ ఇస్రో శాస్త్రవేత్తల కృషి ఫలితంగా భారత్ అద్భుతాన్ని ఆవిష్కరించిందని, ఇది దేశానికి ఎంతో గర్వకారణమన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ సత్యవేణి, సీనియర్ పాత్రికేయులు కృష్ణకుమార్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కుడుపూడి పార్థసారథి, ఇస్రో విశ్రాంత సైంటిస్ట్ తాతయ్యబాబు పాల్గొన్నారు.


ఆనం కళా కేంద్రంలో విద్యార్థుల కేరింతలు

విజయోత్సవాలు

రాజమహేంద్రవరం సిటీ: చంద్రయాన్ 3 విజయవంతం కావడంతో నగరంలో సంబరాలు మిన్నంటాయి. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ నగర శాఖ తరపున ఆర్యాపురంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. దానవాయిపేట సురుచి సంస్థ పాదచారులకు, వాహనదారులకు స్వీట్స్ పంచిపెట్టి ఆనందం పంచుకుంది.


చంద్రయాన్3ని తిలకిస్తున్న జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, కమిషనర్ దినేష్ కుమార్


చంద్రయాన్ విజయవంతం కావడంతో నిర్వహిస్తున్న ర్యాలీ

ఆ క్షణాలు మరువలేను



తెరమీద ప్రయోగం చూస్తున్నాను. సమయం దగ్గర పడుతోంది. అనుకున్న సమయానికి విక్రమ్ ల్యాండర్ చంద్రునిపై దిగింది. మనదేశం చంద్రునిపై చేస్తున్న ప్రయోగాన్ని కళ్లారా చూస్తానని అసలు అనుకోలేదు. చాలా భావోద్వేగానికి గురయ్యాను. ఈ క్షణాలు ఎప్పటికీ మరిచిపోలేను.

– ఇ.అమృత, ఇంటర్

దేశం గర్వించే సమయం



దేశం మొత్తం గర్వించదగ్గ సమయం. ఇస్రో చేసిన ప్రయోగం విజయవంతం కావడంతో చాలా ఆనందం వేసింది. చంద్రుడిపై ల్యాండర్‌ను దించి మన దేశ సత్తాను ప్రపంచ దేశాలకు చూపించారు. నాతోటి స్నేహితులతో కలిసి ప్రయోగాన్ని చూస్తూ ఎంజాయ్ చేశాను.

– ఇ.నవ్య, డిగ్రీ

చాలా ఆనందం



విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై దిగుతుంటే చాలా ఆనందం వేసింది. దాన్ని నా పక్కనున్న స్నేహితులతో పంచుకున్నాను. ఓటమి గెలుపునకు నాంది అని చంద్రయాన్ 3 ప్రయోగం నిరూపించింది. మా స్కూలులో అందరితో కలిసి చంద్రయాన్ ప్రయోగాన్ని చూశాను.

– గెంజేటి సంతోష్‌కుమార్, ఎనిమిదో తరగతి

చాలా అద్భుతం



చంద్రయాన్ ప్రయోగం చాలా అద్భుతం. దీనిద్వారా మన దేశ గొప్పదనం ప్రపంచానికి తెలిసింది. ఈ ప్రయోగం మనకే కాదు పలు దేశాలకు ఎంతగానో ఉపయోగం. దీనికి రేయింబవళ్లు కృషి చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు వందనాలు.

– గ్రంధి వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు, నన్నయ మున్సిపల్ స్కూలు

ఇస్రోకు శుభాకాంక్షలు


ఇస్రో ఆకారంలో కడియం హైస్కూల్ విద్యార్థులు

కడియం: చంద్రయాన్ 3 విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ స్థానిక హైస్కూలు విద్యార్థులు ఇస్రో అక్షరాల ఆకృతిలో ఏర్పడి శుభాకాంక్షలు తెలిపారు. హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇస్రో శాస్త్రవేత్తలు చేస్తున్న ప్రయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, రఫీ, రాజు, డేవిడ్, వీరబాబు, శరత్, సువర్ణవేణి, పద్మశ్రీ పాల్గొన్నారు.

బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీ


బ్యాటరీ ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో బుధవారం ఐదుగురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లను ఎంపీ మార్గాని భరత్ రామ్ పంపిణీ చేశారు. ఇద్దరికి బ్యాటరీ ట్రై సైకిళ్లు, మరో ముగ్గురికి సాధారణ ట్రై సైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్‌కేవీటీలో తెలుగుభాషా ఉత్సవాలు

సీటీఆర్ఐ: ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ, కళా గౌతమి సరస్వతి పరిషత్ సంయుక్త నిర్వహణలో తెలుగు భాషా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎబల్ రాజబాబు బుధవారం ప్రకటనలో తెలిపారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి (ఈనెల 29) సందర్భంగా గురువారం నుంచి ఈనెల 29 వరకూ ఆరు రోజులు పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ పీవీబీ సంజీవరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వితరణ

కడియం: స్థానిక హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ.. తన తల్లి నూకమ్మ వర్ధంతిని పురస్కరించుకుని కడియంలోని బాలురు, బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు రూ.12 వేలు విలువైన నిత్యావసరాలు, విద్యార్థులకు ఉపయోగపడే పలు వస్తువులు బుధవారం అందజేశారు. మూడు కిలోమీటర్ల దూరం నుంచి కాలినడకన పాఠశాలకు వస్తున్న హేమ అనే పదోతరగతి విద్యార్థినికి సైకిల్ అందించారు. ఆరు నుంచి పదో తరగతి వరకూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను బహుమతులు, జ్ఞాపికలతో అభినందించారు. స్కూలు ఆయాలకు నూతన వస్త్రాలు ఇచ్చారు. హెచ్ఎం టి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జలజీవన్ పనుల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: జలజీవన్ మిషన్‌లో భాగంగా రాజవోలు, వెంకటనగరం గ్రామాల్లో చేపట్టిన పనులను నేషనల్ జలజీవన్ మిషన్ (ఎన్‌జేజేఎం) సెంట్రల్ టీమ్ బుధవారం పరిశీలించింది. స్థానికులతో జలజీవన్ మిషన్ ప్రగతిపై ఆరా తీసింది. ఈ బృందంలో విశ్రాంత చీఫ్ ఇంజినీర్ (వెస్ట్ బెంగాల్) సౌమిత్రసేన్‌గుప్త, చీఫ్ ఇంజినీర్ (శ్రీనగర్) జీఏ బేగ్ సభ్యులుగా ఉన్నారు.

రాజవోలులో పొలంబడి

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు గ్రామంలో బుధవారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పంట చేలలోకి దిగి దుబ్బులను వ్యవసాయాధికారులు, రైతులు పరిశీలించారు. వరిని ఆశించిన పురుగులు, తెగుళ్లను గుర్తించారు. వరికి మేలు చేసే మిత్ర పురుగులను కూడా గుర్తించి, శత్రు మిత్ర పురుగుల నిష్పత్తి పరిశీలించి, ఎటువంటి పురుగుమందులు పిచికారి చేయాల్సిన అవసరం లేదని నిర్ణయించుకున్నారు. అనంతరం రైతులతో కలిసి భాగస్వామ్య కార్యాచరణ చేపట్టారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వేపగింజల కషాయం తయారు చేసే విధానం, దాని ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ జయరామలక్ష్మి, మండల వ్యవసాయాధికారి ఏ.భీమరాజు పాల్గొన్నారు.

క్రీడాకారిణులకు సాయం

రాజమహేంద్రవరం రూరల్: కేరళలో సెప్టెంబర్ 8 నుంచి పది వరకూ జరిగే 2వ సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ 2023లో పాల్గొంటున్న క్రీడాకారిణులకు బుధవారం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ రూ.25 వేలు ఆర్థికసాయం చేశారు. పోటీలకు హాజరవుతున్న కొంతమూరుకు చెందిన అఖిల, లక్ష్మీ భవాని, ధవళేశ్వరానికి చెందిన వెంకట కిరణ్మయి, శరణ్య, కంబాల చెరువుకు చెందిన వైష్ణవికి అందజేశారు.

చేప పిల్లల విడుదల

ధవళేశ్వరం: దోమల లార్వా నియంత్రణకు గంబూషియా చేప పిల్లలను బుధవారం మురుగు కాలువల్లోకి వదిలారు. డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ధవళేశ్వరం, పాలచర్ల, సీతానగరం, కోరుకొండ, రాజానగరం, జి.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని సుమారు ఒక లక్ష చేపలు విడిచిపెట్టారు. కార్యక్రమంలో డీఎంవో జి.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కంబాలచెరువు: ఆన్‌లైన్ మోసాలలో కొత్త విధానానికి నేరగాళ్లు తెరతీశారు. టెలిగ్రామ్ యాప్ ద్వారా లింక్ పంపి, అందులో సొమ్ములు వేస్తే రెట్టింపు వస్తాయని నమ్మించి, అనంతరం బ్యాంకు ఖాతాలో సొమ్మంతా ఖాళీ చేస్తున్నారు. ఇటీవల ఉండ్రాజవరంలో ఒక యువతి దీని బారినపడడం, పోలీసులు రంగ ప్రవేశం చేసి, వెంటనే యువతి బ్యాంకు అక్కౌంట్‌ను ఫ్రీజ్ చేయించారు. దీనిపై జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం మీడియాకు ప్రకటన విడుదల చేశారు. లలిత అనే యువతికి ఒక రోజు టెలిగ్రామ్ నుంచి ఒక లింక్ వచ్చింది, దానిని క్లిక్ చేసి చూడగా అందులో రూ.2 వేలు జమ చేస్తే రూ.4 వేలు వస్తాయి అని ఉంది, ఆమె కొంచెం ఆలోచించి రూ.2 వేలు జమ చేసింది. వెంటనే తన ఖాతాలో రూ.4 వేల బ్యాలెన్స్ చూపించింది. మళ్లీ రూ. 4 వేలు వేయడంతో రూ. 8 వేలు వచ్చాయి. దీంతో అలా రూ.రెండు లక్షల వరకు డిపాజిట్ చేసింది. తర్వాత తన డబ్బులు మొత్తం వెనక్కి తీసుకోవడానికి ప్రయత్నించగా, ఆ డబ్బులు వెనక్కి రాలేదు. దీంతో ఆమె మోసపోయానని గ్రహించి వెంటనే ఉండ్రాజవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇన్‌చార్జి ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సై కె.రామారావు రంగంలోకి దిగి ఆ యువతి బ్యాంకు ఖాతాను వెంటనే బ్లాక్ చేయించి ఆమె ఖాతాలో సొమ్ములు లావాదేవీలు జరగకుండా ఆపి వేయించారు. ఎవరైనా ఇలాంటి సైబర్ నేరాలు బారిన పడి మోసపోతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930, డయల్ 100, దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

జగన్ పాలనలో బీసీలకు సముచిత స్థానం

- ఏకతాటిపైకి వస్తే విజయం తథ్యం
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు బోస్


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు బోస్, చిత్రంలో ఎంపీ భరత్ రామ్, చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు సముచిత స్థానం కల్పించారని వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్ర బోస్ అన్నారు. బొమ్మూరులోని నరసింహరాజు ఫంక్షన్ హాల్లో బుధవారం సాయంత్రం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో బీసీల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా పిల్లి సుభాష్ చంద్ర బోస్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ హాజరయ్యారు. ఎంపీ బోస్ మాట్లాడుతూ దేశంలోనే 139 బీసీ కులాలు ఉన్నాయని, ప్రతి నియోజకవర్గంలో 50 శాతం బీసీలున్నారన్నారు. బీసీలంతా ఏకతాటిపైకి వస్తే రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి చందన నాగేశ్వర్ గెలుపు తథ్యమన్నారు. నియోజకవర్గంలో జయహో బీసీ.. జయహో జగనన్న పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు.

సమష్టిగా ఉంటేనే ఎదుగుదల: ఎంపీ భరత్

బీసీలు సమష్టిగా ఉంటేనే రాజకీయ ఎదుగుదల సాధ్యమని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. రూరల్ నియోజకవర్గంలోని రెండున్నర లక్షల మంది ఓటర్లలో 1.25 లక్షల మంది బీసీలేనన్నారు. ప్రతి ఓటు వైఎస్సార్ సీపీకే పడేలా, మిగిలిన సామాజిక వర్గాల మద్దతు లభించేలా ఇప్పట్నుంచీ ప్రతీ ఒక్కరూ నిస్వార్థంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

అన్ని రంగాల్లో రిజర్వేషన్లు

ఏపీజీఅండ్‌బీసీ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అన్నిరంగాలలో రిజర్వేషన్లు కల్పించడంతో పాటు, 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీలకు ఒక గుర్తింపు తీసుకువచ్చారన్నారు. నియోజకవర్గంలోని బీసీలందరూ తనకు మద్దతుగా నిలవాలన్నారు. రాష్ట్ర సంచార జాతుల కార్పొరేషన్ చైర్మన్ పెంద్ర వీరన్న మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు సీఎం జగన్ వెన్నుదన్నుగా నిలిచారన్నారు. రూరల్ నియోజకవర్గ పరిశీలకుడు పీకేరావు, రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పొలిక శ్రీను, రాష్ట్ర ఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి చిన వీరభద్రయ్య పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు

- సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- ఉత్సాహంగా గడప గడపకూ..


ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న సిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: సీఎం జగన్ పాలనలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం నగరంలో 49వ డివిజన్ ఇన్‌చార్జి బర్రే కొండబాబు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న పథకాలు ఏ విధంగా అందుతున్నాయో తెలుసుకున్నారు. జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం ఆయన ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అర్హులందరికీ పథకాలు అందజేస్తున్నారన్నారు. సుబ్బారావు నగర్ క్వారీ ఏరియాలో పర్యటిస్తుండగా స్థానికులు డ్రైనేజీ, విద్యుత్ సమస్యలను తెలిపారు. వెంటనే అక్కడికక్కడే సంబంధిత సిబ్బందితో మాట్లాడి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, గారా చంటిబాబు, నగర ప్రధాన కార్యదర్శి ఎస్‌కే ఖాన్, ఇన్నీసుపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ గేడి అన్నపూర్ణ రాజు పాల్గొన్నారు.

బంగారుకొండ కిట్ పంపిణీ

ప్రకాశం నగర్: నిరంతర పర్యవేక్షణతో చిన్నారులను సంపూర్ణ ఆరోగ్య వంతులు చేయవచ్చని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ అన్నారు. బుధవారం ఉదయం స్థానిక ఇన్నీస్‌పేటలోని వాక అప్పలస్వామి వీధిలో నివాసం ఉంటున్న బంగారు కొండ గజ్జి నాగభూషణం ఇంటిని వరుసగా 9వ వారం ఆయన సందర్శించారు. ఆ బాలుడికి బంగారు కొండ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం చొరవతో చేపట్టిన బంగారుకొండ కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతో పాటు బంగారుకొండ కింద ఇస్తున్న అదనపు ఆహారం కూడా కచ్చితంగా పిల్లల ఎదుగుదలకు ఉపయోగపడుతోందన్నారు. అర్బన్ సీడీపీవో నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

చందా సత్రం కీర్తిని ఇనుమడింపజేయాలి

- ఎంపీ భరత్ రామ్
- నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం చరిత్రలో చందా సత్రానికి ప్రముఖ స్థానం ఉందని, ఆ కీర్తిని మరింత ఇనుమడింపజేసేలా నూతన పాలక మండలి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ కోరారు. చందా సత్రానికి దేవదాయ, ధర్మదాయ శాఖ నియమించిన పాలకమండలితో బుధవారం ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా పుత్సా శ్రీకొమారి రామ శర్మ, డైరెక్టర్లుగా పంపన శ్రీనివాస్, లక్ష్మీపద్మావతి, పాడుగు శ్రీను, నల్లా రామాంజనేయులు, ఉల్లం గణేశ్వరి, కొండేటి సుధాకర్, కందికొండ రత్నం, గోకాడ సరస్వతి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చందా సత్రానికి ఎంతో చరిత్ర, అంతకు మించి ఆస్తులూ ఉన్నాయన్నారు. గతంలో ఎమ్మెల్యేగా రౌతు సూర్యప్రకాశరావు ఉన్నప్పుడు చందా సత్రాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు.

మున్సిపల్ నిధులను టీడీపీ మేయర్లు మేసేశారు

గతంలో నగర మేయర్లు, పాలకవర్గ సభ్యులు అభివృద్ధిని పూర్తిగా విస్మరించి అడ్డంగా బొక్కేశారని, ఇప్పుడు తాము చేసే అభివృద్ధిని చూసి టీడీపీ నాయకులు గగ్గోలు పెడుతున్నారని ఎంపీ భరత్ రామ్ విమర్శించారు. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ అయిన తర్వాత మూడుసార్లూ టీడీపీ వారే మేయర్లు అయ్యారని, నగర పాలక సంస్థ ఆదాయాన్ని అడ్డంగా తినేశారన్నారు. ఇప్పుడు ఆ నగర పాలక సంస్థ నిధులతోనే నగరాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దుతుంటే చూడలేకపోతున్నారన్నారు. గోదావరి తీరాన్ని హైదరాబాద్ ట్యాంక్ బండ్ మాదిరిగా దాదాపు రూ.70 కోట్లతో అభివృద్ధి చేయబోతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాజమహేంద్రవరం రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, చందా సత్రం ఈవో రాగోలు శ్రీను తదితరులు పాల్గొన్నారు.


చందాసత్రం పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎంపీ భరత్ రామ్

టంగుటూరి సేవలు చిరస్మరణీయం

సీటీఆర్ఐ: ఆంధ్ర రాష్ట్రం మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెట్ అథారిటీ (రుడా) కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రుడా వైస్ చైర్మన్ బి.బాలస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రకాశం పంతులు నిరుపేద కుటుంబంలో పుట్టి, వారాలు చేసుకుంటూ చదువుకుని, ఆంధ్రప్రదేశ్ మొదటి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారని, మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకీ ఎదురుగా గుండె నుంచి ఆంధ్రకేసరి అని పేరు పొందారన్నారు. కార్యక్రమంలో రుడా సెక్రటరీ జి.శైలజావల్లి, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ ఎం.అనిత, జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ ఆర్‌వీ కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక ఆంధ్రకేసరి డిగ్రీ కళాశాలలో బుధవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను కళాశాల చైర్మన్ షేక్ అసదుల్లా అహ్మద్ నిర్వహించారు. చింత జోగి నాయుడు, షేక్ హర్షద్, బీవీ అప్పారావు పాల్గొన్నారు.

కడియం: టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు స్ఫూర్తిదాయకమని స్థానిక గ్రంథాలయాధికారి శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల అన్నారు. స్థానిక గ్రంథాలయంలో టంగుటూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. 108 సిబ్బంది నారాయణ, హనీషా, అన్నవరం, భాస్కరరావు, సచివాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: టంగుటూరి ప్రకాశం పంతులు జీవితాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చవాన్ శ్యామ్‌రాజ్ నాయక్ అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాలలో బుధవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఘనంగా నిర్వహించారు.


ఆంధ్రకేసరి డిగ్రీ కళాశాలలో ప్రకాశం పంతులు జయంతి

పట్టపగలే చోరీ

కంబాలచెరువు: ప్రకాశం నగర్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో పట్టపగలు ఇంటి తలుపులు పగులకొట్టి రూ.6 లక్షలు, 30 గ్రాముల బంగారం ఎత్తుకెళ్లిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎనుగంటి సుబ్రహ్మణ్యం ఒక ప్రైవేట్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. అతని భార్య కుమార్తె ఇంటికి వెళ్లింది. రోజువారీలానే సుబ్రమణ్యం ఉదయం 11 గంటలకు డ్యూటీకి వెళ్లాడు. మధ్యాహ్నం 1.30 గంటలకు తిరిగి అపార్ట్‌మెంట్‌లోని రెండో ఫ్లోర్‌లోని తన ఇంటికి వచ్చేసరికి తలుపులు తీసి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూసేసరికి బీరువాలోని నగదు, బంగారం మాయమయ్యాయి. దీంతో విషయాన్ని పోలీసులకు తెలిపాడు. దీంతో వారు క్లూస్ టీం ఇంటిలో పలు ఆధారాలను సేకరించింది. సీసీ కెమెరాలను పరిశీలించి దొంగతనం చేసిన వ్యక్తి పాత నేరస్తుడేనని గుర్తించారు.